క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

పద్మనాభం: బోని సబ్ స్టేషన్ పరిధిలోని శిర్ల పాలెం ఫీడర్ లైన్‌లో పాత విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి వేయనున్నందున పలు గ్రామాలకు శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈఈ జగన్మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫీడర్ పరిధిలోని అనంతవరం, గొల్లలపాలెం, పెంట, కొవ్వాడ, గంధవరం, తిమ్మాపురం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు.

వాటర్ స్పోర్ట్స్ సమ్మర్ క్యాంప్ ప్రారంభం నేడు

కొమ్మాది: రుషికొండ బీచ్ వద్ద జిల్లా స్పోర్ట్స్ అథారిటీ, కానోయింగ్ మరియు కయాకింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సహకారంతో వాటర్ స్పోర్ట్స్ సమ్మర్ క్యాంప్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఈ శిబిరాన్ని శాప్ చైర్మన్ రవి నాయుడు శుక్రవారం ప్రారంభించనున్నారు. జలక్రీడలను ప్రోత్సహించడంతో పాటు అవి తగినమేరకు అభివృద్ధి చెందడానికి దీన్ని నిర్వహించనున్నారు.

వైఎస్సార్‌సీపీ మండల కమిటీ ఎన్నికలు రేపు

తగరపువలస: వైఎస్సార్‌సీపీ ఆనందపురం మండల కమిటీ, అనుబంధ విభాగ కమిటీల ఎన్నిక గండిగుండం సర్పంచ్ గంరెడ్డి శ్రీను ఇంటి వద్ద శనివారం జరుగుతుందని పార్టీ మండల అధ్యక్షుడు బంక సత్యం తెలిపారు. ఉదయం 9 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో పార్టీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు పాల్గొంటారన్నారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

డోర్ నంబర్లు వేసేందుకు అదనపు వసూళ్లు

తగరపువలస: ఆనందపురం మండలంలో డోర్ నంబర్లు వేయడానికి డీపీవో అనుమతి పొందిన వారు అదనంగా వసూళ్లు చేస్తున్నారని ముచ్చర్ల పంచాయతీ వాసులు ఆరోపించారు. పంచాయతీకి సంబంధం లేకుండా ఇంటింటా డోర్ నంబర్లు వేయడానికి రూ.40 వరకు వసూలు చేసుకోవచ్చని గతంలో డీపీవో అనుమతి ఇచ్చారన్నారు. దీనికి విరుద్ధంగా అదనంగా వసూలు చేస్తున్నారని, దీనిని అరికట్టాలని పంచాయతీ వాసులు కోరుతున్నారు.

రైతులకు బ్యాంకుల సహకారం



మాట్లాడుతున్న యూనియన్ బ్యాంకు డీజీఎం నరసింహకుమార్

తగరపువలస: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచనల మేరకు బ్యాంకులు రైతులకు సహకారం అందిస్తాయని యూనియన్ బ్యాంక్ డీజీఎం నరసింహకుమార్ అన్నారు. వ్యవసాయాభివృద్ధిపై బ్యాంక్ ఆనందపురం బ్రాంచ్‌లో గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించడం ద్వారా వడ్డీ తగ్గిస్తూ, బ్యాంకులు రెట్టింపు రుణాలు ఇస్తాయన్నారు. చిన్న తరహా పరిశ్రమలు నిర్వహిస్తున్న వారు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఖాతాదారుడు భూమి దస్తావేజులను జత కలిపి బంగారు ఆభరణాలపై రుణాలు తీసుకుంటే వడ్డీ తగ్గుతుందన్నారు. సబ్సిడీ ద్వారా రైతులకు యంత్ర పరికరాలు అందిస్తున్నామన్నారు. స్వయం సహాయక సంఘాలు సకాలంతో వాయిదాలు చెల్లిస్తూ వడ్డీ భారం తగ్గించుకోవాలన్నారు. ఏవో చావా సంధ్యా రత్నప్రభ మాట్లాడుతూ కౌలు రైతులు కూడా పంట రుణాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో పంచాయతీకి చెందిన పలువురు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహన



షాపుల యజమానులకు అవగాహన కల్పిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

మద్రిపాలెం: ప్లాస్టిక్ వినియోగం వల్ల మానవ జాతికి, జంతుజాలానికి కలిగే అనర్థాలపై జీవీఎంసీ అధికారులు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 50వ వార్డులోని పలు షాపుల యజమానులు, వినియోగదారులకు ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు వాడడం వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి వివరించారు. ప్లాస్టిక్ కవర్లు వాడితే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ సుధాకర్, సెక్రటరీలు, సిబ్బంది పాల్గొన్నారు.

సులభంగా ఇంగ్లిష్ ENGLISH

తెలుగు మీడియం నుంచి వచ్చిన వారికి ఇంగ్లిష్ అంటే ఎంతో భయం. ఇంగ్లిష్‌లో గలగలా మాట్లాడాలని, తప్పుల్లేకుండా రాయాలని అభిలాష. విద్యార్థుల నుంచి గృహిణులు, చిరుద్యోగుల వరకు దాదాపు అందరిదీ ఆకాంక్ష. అలాంటి వారి కలలను సాకారం చేస్తున్నారు మోహనరావు మాస్టారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడైన ఈయన తర్ఫీదు ఎందరికో ఉపయోగపడుతోంది. ఈ నెల 3న ఉచిత శిక్షణ శిబిరం ప్రారంభమైంది.

ఉచిత శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయుడు ▪ స్పోకెన్, రైటింగ్, స్టోరీ రైటింగ్‌లో తర్ఫీదు ▪ వేసవి శిబిరం ప్రారంభం



ఇంగ్లిష్ పాఠాలు, కథలు చదువుతున్న విద్యార్థులు



ఇంగ్లిష్ గ్రామర్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు, గృహిణులు

తగరపువలస: విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎదుర్కొనే ఇంగ్లిష్ సమస్యను అధిగమించేందుకు, ఆంగ్ల భాషను సులువుగా అభ్యసించేందుకు నాలుగు దశాబ్దాలుగా కృషి చేస్తున్నారు ప్రభుత్వ ఉపాధ్యాయుడు గంటాన మోహనరావు. జీవీఎంసీ ఒకటో వార్డు కొండపేటకు చెందిన మోహనరావు నగరంలోని దండుబజారు ఎంవీడీ హైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇంగ్లిష్‌ను సులభంగా అర్థం చేసుకునేలా 'ది బుక్ ఆఫ్ ఇంగ్లిష్ సినోనిమ్స్', స్పీక్ ఇంగ్లిష్ యాజ్ ఇంగ్లిష్' పేర్లతో రెండు పుస్తకాలు కూడా రాశారు. సార్వత్రిక భాష అయిన ఇంగ్లిష్‌లో ప్రపంచ ప్రమాణాలు అందుకునేందుకు, పోటీ పరీక్షలలో నెగ్గడానికి ఇంగ్లిష్ భాషా నైపుణ్యాలు తప్పనిసరని నమ్మే ఉపాధ్యాయుడు ఈయన. అందుకే ఉపాధ్యాయులు, విద్యార్థులలో ఇంగ్లిష్‌పై నెలకొని ఉన్న భయాలను పోగొట్టడానికి తరచూ పని చేస్తుంటారు. అందులో భాగంగా ఈ ఏడాది వేసవి సెలవులను కూడా వినియోగించుకుంటున్నారు. ఈ నెల 3 నుంచి జూన్ 3 వరకు భీమిలి మండలం కొత్త మూలకుద్దు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను వేదికగా చేసుకున్నారు. ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు స్పోకెన్ ఇంగ్లిష్, రైటింగ్ ఇంగ్లిష్, స్టోరీ టెల్లింగ్‌లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. ఇందులో విద్యార్థులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, గృహిణులు 60 మందికి పైగా పాల్గొంటున్నారు.

సమాజసేవలోనూ..

విద్యాసేవతో పాటు సమాజసేవలో 1985 నుంచి పాటు పడుతున్నారు. బుద్ధ ఉచిత శిక్షణ కేంద్రాలు, సాయంత్రం వేళల్లో వయోజనులకు అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం, నిరుపేద నిరుద్యోగులను పోటీ పరీక్షలకు సిద్ధం చేయడం, ప్లంబింగ్, డ్రైవింగ్ వంటి వృత్తి శిక్షణను ఏర్పాటు చేసి, ఇప్పటికీ వారికి ఉపాధి కల్పించడానికి కృషి చేస్తూనే ఉన్నారు. 600కు పైగా వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు.



ఉత్సాహంగా శిక్షణకు హాజరవుతున్న చుట్టుపక్కల విద్యార్థులు

పాఠ్యాంశాలు సులభం అవుతాయి



మాస్టారు ఇంగ్లిష్‌లో ప్రతీది విడమరచి చెబుతున్నారు. తరగతి గదిలో తోటి విద్యార్థులతో మాట్లాడిస్తున్నారు, రాయిస్తున్నారు. సొంతంగా కథలు రాయిస్తున్నారు. నేను 9వ తరగతి పూర్తి చేసుకుని, 10వ తరగతిలోకి వస్తున్నా. టెస్ట్‌లో రాణించగలనని నమ్మకం ఉంది.
– చిల్ల నీహారిక, స్కూల్ విద్యార్థిని

ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ద్వారా సేవలు..

సెలవు రోజుల్లోనే కాకుండా నిత్యం సాయంత్రం వేళల్లో ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ద్వారా మిగిలిన ఉపాధ్యాయులు, అధ్యాపకుల సాయంతో డీఎస్సీ, టెట్, రైల్వే, పోలీస్, ఎన్ఎంఎంఎస్ తదితర పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల కోసం ఇంగ్లిష్ గ్రామర్‌తో పాటు మిగిలిన సబ్జెక్టులలో క్రమం తప్పకుండా శిక్షణ ఇస్తున్నారు. 70 మందికి పైగా విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ పరీక్ష ద్వారా ఉపకార వేతనాలు పొందడానికి ఈ శిక్షణ దోహదపడింది. 2009లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు అందుకున్న నాటి నుంచి ఏటా ఏదో గ్రామంలో స్పోకెన్ ఇంగ్లిష్‌లో ఉచిత శిక్షణ ఇస్తూనే ఉన్నారు. వేసవి సెలవుల్లోనే కాకుండా ఇకపై నిరంతరాయంగా గ్రామీణ ప్రాంతాల వారికి ప్రతిరోజూ గంట పాటు స్పోకెన్ ఇంగ్లిష్‌లో శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు.

ఇంగ్లిష్‌లో ధైర్యంగా మాట్లాడుతున్నా



నేను ఎల్ఐసీ అడ్వైజర్‌గా పని చేస్తున్నాను. క్లైంట్‌లలో తెలుగు వారే కాకుండా ఇంగ్లిష్ మాట్లాడేవారు కూడా అధికం. కేవలం 5 రోజులలోనే స్పోకెన్ ఇంగ్లిష్‌లో మెలకువలు నేర్చుకున్నాను. నెలరోజులు శిక్షణ పూర్తయితే ఇంగ్లిష్ నైపుణ్యాలు మెరుగుపరచుకోగలను.
–జీరు పావని సింహాచలం, పాతపాలెం

బోధనకు సహకరిస్తుంది



నేను ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నాను. విద్యార్థులకు బోధించేటప్పుడు, ఇంగ్లిష్‌లో అనర్గళంగా మాట్లాడటానికి ఈ శిక్షణ దోహదపడుతుంది. ఈయన రచించిన రెండు ఇంగ్లిష్ పుస్తకాలు కూడా పాఠశాలలకు ఉచితంగా అందించారు.
–సోమాదుల కనకమహాలక్ష్మి, మూలకుద్దు

ఇంగ్లిష్ మీడియంలో చేరేవారికి ఉపయోగం



తెలుగు మాతృభాష కలిగి, ఇంగ్లిష్ మీడియం చదువుకునే నాలాంటి వారికి స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు సహాయకారిగా ఉంటాయి. ఇంటర్మీడియట్ పూర్తి చేసి డిగ్రీలో చేరనున్నాను. పోటీ పరీక్షలకు కూడా ఈ శిక్షణ తోడ్పడుతుంది.
–చిల్ల రేష్మ, మూలకుద్దు

ఇంగ్లిష్ ఇంత సులభమా అనిపిస్తుంది



నేను బీటెక్ చదువుతున్నా ఇంగ్లిష్ నాలెడ్జ్ అంతంత మాత్రమే. మాస్టారు మా గ్రామంలో ఉచితంగా స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ ఇస్తున్నారు. మాకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతోంది. ఎక్సర్‌సైజ్‌లు చేయించడంతో ఇంగ్లిష్ ఇంత సులభమా అనిపిస్తుంది.
–కొయ్య వెంకటలక్ష్మి, మూలకుద్దు

టెక్నిక్స్ తెలిస్తే ఎంతో సులభం



ఇంగ్లిష్‌లో వెనుకబడిన విద్యార్థుల కోసం తెలుగు అచ్చులు, 12 యాక్టివిటీస్ ద్వారా 12 రోజుల్లో నేర్చుకునేలా.. పుస్తకపఠనం సులభతరం చేసేలా పుస్తకం తయారు చేశాను. 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు పనికి వస్తుంది. అక్షరదోషాలు లేకుండా విద్యార్థులు ఇంగ్లిష్‌ను చదవడం, రాయడం చేయగలరు. సింపుల్ టెక్నిక్స్ ప్రాక్టీస్ చేయడం ద్వారా ఇంగ్లిష్‌ను జయించవచ్చు. –గంటాన మోహనరావు, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, చిట్టివలస

నిజాలను నిర్భయంగా రాస్తున్నారనే..

- సాక్షి ఎడిటర్ నివాసంలో పోలీసుల అక్రమ సోదాలు
- భీమిలి ప్రెస్‌క్లబ్ ప్రతినిధుల ఆగ్రహం



భీమిలి డిప్యూటీ తహసీల్దార్ శ్రీనుబాబుకు వినతిపత్రం అందిస్తున్న ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు



భీమిలి ఆర్డీవో సంగీత్ మాథూర్‌కు వినతిపత్రం అందిస్తున్న ప్రెస్ క్లబ్ ప్రతినిధులు

తగరపువలస: ఎలాంటి అనుమతులు లేకుండా సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డి నివాసంలో పోలీసులు సోదా చేయడాన్ని భీమిలి ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు ఖండించారు. దీనిపై ఆర్డీవో సంగీత్ మాథూర్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనుబాబుకు వినతిపత్రాలు అందించారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఎస్.రమణప్రసాద్ మాట్లాడుతూ ప్రజల తరఫున నిలబడి, నిజాలను నిర్భయంగా రాస్తున్న సాక్షి మీడియాపై ప్రభుత్వ దమనకాండ సిగ్గుచేటన్నారు. అభ్యంతరాలు ఏమైనా ఉంటే చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. భయాందోళనలకు గురి చేసి మీడియా చేతికి సంకెళ్లు వేయలేరని, ఇది ప్రజాస్వామ్యానికి ఆరోగ్యకరం కాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు అడిదం కిషోర్, ముద్దాడ రాజు, వల్లభదాసు శివాజీ, జి.శ్రీనివాసరెడ్డి, రాంభక్త ప్రభాకర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పూర్ణ కలశానికి ప్రత్యేక పూజలు

నేడు అనంతుని విమాన శిఖర ప్రతిష్ఠ



అనంతుని కళల కలశాన్ని, స్నపన కలశాన్ని ఆలయంలోకి తీసుకువస్తున్న అర్చకులు



విద్యుత్ వెలుగుల్లో అనంతుని ఆలయం



పూర్ణ కలశాన్ని పవిత్ర జలాలతో శుద్ధి చేస్తున్న అర్చకులు

పద్మనాభం: పద్మనాభంలోని గిరిపై అనంతుని శిఖర ప్రతిష్ఠ ఉత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. అందులో భాగంగా నాలుగో రోజైన గురువారం పూర్ణ కలశానికి అర్చక స్వాములు ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా అనంత పద్మనాభ స్వామి కళల కలశాన్ని, స్నపన కలశాన్ని అర్చక స్వాములు పట్టుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. తదుపరి కలశాలతో ఆలయంలోకి వచ్చారు. అనంతరం మూడు పవిత్ర నదుల నుంచి తీసుకువచ్చిన జలాలతో స్వామి కలశాన్ని శుద్ధి చేసి, పూజలు నిర్వహించారు. దీనిలో భాగంగా అగ్ని ధ్యానాలు, మహా మంత్ర హోమం, శయనాధివాసం, మహా శాంతి హోమం వంటి పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈవో నానాజీ బాబు పర్యవేక్షణలో జరిగిన పూజల్లో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, పద్మనాభం సర్పంచ్ తాలాడ పాప ఉత్సవ కమిటీ సభ్యులు తాలాడ పద్మనాభం, బుగత సత్యనారాయణ, అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు పాల్గొన్నారు. నిజ రూపంలో అనంత పద్మనాభ స్వామి మూల విరాట్‌ను దర్శించుకుని తరించారు. ఉత్సవాల సందర్భంగా అనంత పద్మనాభ స్వామి ఆలయం విద్యుత్ దీప కాంతులతో దేదీప్యమానంగా వెలుగొందింది.

నేడు శిఖర ప్రతిష్ఠ

అనంత పద్మనాభ స్వామి గిరిపై శుక్రవారం శిఖర ప్రతిష్ఠ జరుగుతుంది. ముందుగా విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, అగ్ని ధ్యానం, శాంతి హోమం, పూర్ణాహుతి, రత్న, ధాతు, బీజాన్యాసాలు వంటి పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం వేద పండితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ అనంతుని విమాన శిఖర ప్రతిష్ఠ నిర్వహిస్తారు. తదుపరి గోదర్శనం, శాంతి కల్యాణం జరగనున్నాయి.

కమనీయం .. శ్రీనివాస కల్యాణం



ప్రత్యేక అలంకరణలో దేవేరులతో శ్రీవారు



కొండపై కల్యాణ వేడుకలు జరిపిస్తున్న నిర్వాహకులు

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు వెంకటేశ్వరమెట్టపై గురువారం శ్రీఅలివేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ వేడుకలను కనులపండువగా జరిగాయి. ఆలయ ట్రస్టీ రాజగిరి కుసుమహర ఆధ్వర్యంలో రామాచార్యుల శర్మ భక్తులతో శాస్త్రోక్తంగా ఈ కల్యాణ వేడుకలు జరిపించారు. అంతకు ముందు వేకువజామున 5 గంటలకు సుప్రభాత సేవ, అంగప్రదక్షిణ, తోమాల సేవ నిర్వహించారు. కల్యాణ వేడుకల అనంతరం భక్తులకు ముత్యాలతో కూడిన అక్షతలు అందించారు. భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

ధార్మిక సంఘాల ఐక్యతతో బాల్య వివాహాలకు అడ్డుకట్ట

సీతంపేట: ధార్మిక సంఘాల ఐక్యతతో బాల్య వివాహ రహిత విశాఖ జిల్లా సాధ్యమని మైనారిటీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, డిప్యూటీ కలెక్టర్ సంశూన్నీసా బేగం అన్నారు. అప్‌హోల్డ్ స్వచ్ఛంద సంస్థ 'యాక్సిస్ టు జస్టిస్ ఫర్ చిల్డ్రన్' అనే ప్రాజెక్టులో భాగంగా అన్ని వర్గాల ధార్మిక సంఘ నాయకులకు ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల నిషేధంలో ధార్మిక సంఘాలు ముఖ్య పాత్ర పోషించాలని కోరారు. మైనారిటీ సంక్షేమ సొసైటీ అధ్యక్షుడు అబ్దుల్ మునీర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా ప్రజలందరికీ బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు తెలియచెప్పడం ఎంత అవసరమో తెలిసిందన్నారు. పురోహిత సంఘ ప్రతినిధి ఆర్.రామారావు మాట్లాడుతూ బాల్య వివాహాలను ఎవరూ ప్రోత్సహించరాదని, ఎండోమెంట్ డిపార్ట్‌మెంట్ ద్వారా మాకు స్పష్టమైన ఆదేశాలు వచ్చాయన్నారు.

మైనింగ్ పేరుతో కొండలను ధ్వంసం చేయొద్దు



గిరిజనులతో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు

తగరపువలస: మైనింగ్ పేరుతో పర్యావరణాన్ని నాశనం చేసి, కొండలను ధ్వంసం చేయకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్ చేశారు. ఆనందపురం మండలం కుసులవాడ పంచాయతీ ఇచ్చాపురం గిరిజన గ్రామం దెయ్యాల మెట్ట కొండలను ఆయన స్థానికులతో కలిసి పరిశీలించారు. అనంతరం వారితో మాట్లాడుతూ క్వార్ట్జ్ గనుల నిక్షేపాల వెలికితీతకు ప్రభుత్వం అగ్నిసముఖ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు 15 ఎకరాల కొండ భూములను 20 ఏళ్ల లీజుకు కట్టబెట్టేందుకు సిద్ధం అవుతోందన్నారు. ప్రభుత్వం ఈ ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ పరిసర భూముల్లో గిరిజన ప్రజలు వరి, మామిడి, కొబ్బరి, జీడి, మునగ, అరటి తదితర పంటలు సాగు చేస్తున్నారన్నారు. ఈ ప్రాంతంలో మైనింగ్ చేపడితే పంటలు పూర్తిగా దెబ్బతిని ఇక్కడి ప్రజల ఉనికికి, జీవనోపాధికి, పశుసంపదకు, వన్యప్రాణులకు హాని జరుగుతుందన్నారు. సాగునీరు, తాగునీరు, భూగర్భజలాలు, గాలి, కలుషితం అవుతాయన్నారు. వీటిని దృష్టిలో పెట్టుకుని మైనింగ్ అనుమతులు రద్దు చేయాలన్నారు. లేదంటే ప్రజల నుంచి ఆందోళన తప్పదన్నారు. కార్యక్రమంలో సీపీఎం జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఏకాదశి ఆర్జిత సేవలు



స్వర్ణతులసీదళాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు



నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణతులసీ దళార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. 108 స్వర్ణ తులసీదళాలతో అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

ఘనంగా బ్రాహ్మణి ముత్యమాంబ పండగ



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

పరవాడ: మండల కేంద్రం పరవాడ గ్రామంలో వెలసిన బ్రాహ్మణి ముత్యమాంబ పండగను గ్రామ ప్రజలు గురువారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు వేకువ జాము నుంచే తరలి వచ్చి, అమ్మవారిని దర్శించుకున్నారు. పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, పరవాడ మాజీ జెడ్పీటీసీ పైల జగన్నాథరావు, సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, మాజీ ఎంపీపీ ఎం.అప్పలనాయుడు, నాయకులు బండారు అప్పలనాయుడు, పైల రామచంద్రరావు, కన్నూరి వెంకటరమణ, అట్టా సన్యాసప్పారావు, వియ్యపు చిన్న తదితరులు అమ్మవారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన భారీ అన్న సమారాధనలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. డప్పు వాయిద్యాలు, చిడతలు, భజనలు, నేల డ్యాన్సుల నడుమ అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు. భారీ బాణసంచా వెలుగుల నడుమ అమ్మవారి అనుపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. రాత్రికి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.